# సంశయాత్మ

విశ్వనాథం చేతిగడియారానికి దాదాపు అతనివయస్సే వుంటుంది. అంటే ఏభై ఏళ్ళు నిండేయి. అందుకని అది సరిగ్గా పనిచెయ్యడం లేదనే అనుమానంకొద్దీ చుట్టుప్రక్కల వాళ్ళని 'టైమెంతయిందండీ' అని అడుగుతాడు.

వాళ్ళు వెంటనే టైమెంతయిందో చెప్పరు. చిరునవ్వుతో అతని చేతిగడియారం వేపు చూస్తారు. ఆచూపు అర్థంచేసుకుని విశ్వనాథం "ఈ గడియారం సరిగ్గాలేదులెండి" అంటాడు. వాళ్లు పదయిందని అన్నారో ఇంక ఆఫీసుకు పరుగుపెడతాడు.

మామూలుగా బస్సు దిగి ఆఫీసువేపు నడుస్తూ టైమెంతయిందో అడుగుదామనుకుంటే చుట్టుపట్ల దగ్గరలో ఎవరూలేరు. ఎదురుగా షాపులో గోడమీదున్న గడియారం చూస్తే అదింకా తొమ్మిదిన్నరే అయింది. ఇంతముందుగా తనెప్పుడూ ఆఫీసుకు వెళడంలేదే గడియారం తప్పుటైము చూపిస్తూ వుండొచ్చు. అసలు గోడ గడియారాలు సరిగ్గా పనిచేస్తాయా? ఎందుకైనా మంచిదని షాపులోకెళ్ళేడు. దుకాణాదారుడు, ఇంత పెద్ద ఫర్నిచర్ షాపులోకి ఎందుకొచ్చావన్నట్లు చూశాడు.

విశ్వనాథం బట్టతలా, మాసినగడ్డం, నలిగిన ముతకచొక్కా, ఇస్త్రీ చెయ్యని పంచ, చెప్పులులేని కాళ్ళు చూసి, వీడు ఫర్నిచర్ తయారుచేసేవాడిలా వున్నాడు. కాని కొనేవాడిలాలేడని నిర్ధారణకొచ్చాడు దుకాణదారుడు.

షాపులో నిగనిగ మెరుస్తున్న రకరకాల సోఫాలు, డ్రెసింగ్ టేబిళ్ళు, డైనింగ్ సెట్లు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు విశ్వనాథం.

నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా చూస్తున్న తన ప్రతిబింబం అద్దంలో కనిపించింది. తృప్తిగా తల విమురుకున్నాడు.

దుకాణదారుడు దగ్గరగావచ్చి "మావర్క్‌షాపు ప్రక్కవీధిలో వుంది. వెళ్ళవయ్యా ఇక్కడి కెందుకొచ్చావు?" అన్నాడు.

"వర్క్‌షాపుకా? ఎందుకూ? నేను ఆఫీసుకెళ్ళాలి" అన్నాడు విశ్వనాథం,

"అదే వర్క్‌షాపూ అదే ఆఫీసు టైమయింది ఓపెన్ చేసుంటారు వెళ్ళు."

"టైమయిందా? ఎంతయిందీ?"

"అదిగో గడియారం, టైము చూడ్డం తెలుసా?"

"తొమ్మిదిన్నరే అయింది. కరెక్టేనా?"

"ముందు బయటికెళ్ళవయ్యా. చచ్చు ప్రశ్నలూ నువ్వూనూ" అంటూ కేకలేశాడు దుకాణదారుడు.

అక్కడుండడం మరి మర్యాదగా వుండదని విశ్వనాథం గబగబ వీధిమెట్టుమీదికొచ్చాడు. ఒక క్షణం ఆగి మళ్ళీ వెనక్కుతిరిగి లోపలికెళ్ళి "ఏమండీ ఇందాక నన్ను వర్క్‌షాపు కెళ్ళమన్నారు ఎందుకండీ" అని అడిగాడు.

"మా వర్క్‌షాపులో ఒకరిద్దరు కార్పెంటర్ల అవసరముంది. అందుకు వెళ్ళమన్నాను."

"నాకు వడ్రంగి పనిరాదండీ" అన్నాడు విశ్వనాథం ఆశ్చర్యంగా.

వడ్రంగి పనిచేతకాక, ఫర్నీచర్‌కొనే తాహతులేక మరి షాపులో కెందుకొచ్చినట్టు? వీడికి మతి స్థిమితం లేదని దుకాణదారుడు నిర్ధారణకొచ్చాడు. "సరేలే వెళ్ళు" అన్నాడు.

తాను వ్రదింగినని అతనెందు కనుకున్నాడో విశ్వనాథానికి అర్థంకాలేదు. ఇంతకీ సరిగా టైమెంతయిందో తెలిసిందికాదు. పోనీ ఎదురుగా వున్న బట్టలషాపులోకి వెళ్ళి టైమడిగితే ఏమో వాళ్ళు తను చేనేత పనివాడనుకుంటాదేమో. ఎందుకొచ్చిన గొడవ. వేగంగా అఫీసుకు వెళడమే ఉత్తమమని గబగబ అడుగులేసుకుంటూ నడిచాడు.

విశ్వనాథం వెళ్ళేసరికి అఫీసులో ఎవరూలేరు. పదయినా అఫీసులో ఎవరూ లేకపోవడం చూసి ఇవాళ అఫీసుకి సెలవేమోనని అనుమానమొచ్చింది విశ్వనాథనికి. ఇవాళ వైకుంఠఏకాదశి. అందుకని సెలవిచ్చారేమో. కాని సెలవని ఎవరూచెప్పలేదే. లోపలికెళ్ళి నాలుగు ప్రక్కాలా చూశాడు. ఒకమూల కూర్చుని అఫీసు బంట్రోతు వీరయ్య బీడి కాల్చుకుంటున్నాడు.

"ఏం వీరయ్యా, ఇవాళ అఫీసు సెలవా అంటూ అడిగాడు విశ్వనాథం."

"సెలవా? ఎందుకండీ:" అన్నాడు వీరయ్య.

"ఇవాళ వైకుంఠ ఏకాదశి."

"అంటె ఏడండీ"

వైకుంఠ ఏకాదశి అంటే ఏమిటో తెలియనివాడితో చర్చించి లాభంలేదనుకున్నాడు విశ్వనాథం. అయినా మనుషులు అంత తెలియకుండా వుంటారా? ఏమో, తెలిసే నాటకమాడుతున్నాడేమో. ఈ వీరయ్యకు తన్ను చూసి అవహేళన చెయ్యాలనే బుద్ధిపుట్టిందేమో అంచేత వీడితో మాట్లాడి ప్రయోజనం లేదనుకున్నాడు విశ్వనాథం.

తన సీటుకు వెళ్ళి కుర్చీలో కూర్చుని టేబిలుమీద ఫైల్సుతీసి పెట్టేడు. ఎదురుగా గోడ గడియారం చూశాడు. పదికి ఇంకా పది

నిముముషాలుంది. తక్కిన గుమస్తాలింకా రాలేదు కాబట్టి ఈ టైము కరక్టేనేమో.

అంతలో వీరయ్యవచ్చి ఆఫీసరుగారు రమ్మంటున్నారని చెప్పేడు

ఇదేమిటీ? రోజూ పదిన్నరయితేగాని రాని ఆఫీసరు పదికాకుండా ఎందుకొచ్చేశాడో సరే వచ్చారండి. వస్తే వెంటనే కొంప మునిగినట్లు తన్నెందుకు పిలవాలీ? పొద్దున్నే ఏం చీవాట్లేస్తాడో, ఏం కొంప మునుగుతుందో అని బితుకు బితుగ్గా ఆఫీసరు గదిలో కేళ్ళేడు విశ్వనాథం.

"హలో మిస్టరు విశ్వనాథం, మొన్న మీరు తయారుచేసిన స్టేట్ మెంటు ఆడిటర్ చూశాడు" అంటూ సిగరెట్టు నుసి ఏష్ ట్రేలో రాల్చేడు ఆఫీసరు. అందులో ఏదో పెద్దపొరపాటు దొర్లే వుంటుంది లేకపోతే ఆఫీసరు యింత పొద్దున్నే పిలిచి ఆ ప్రసక్తి ఎందుకు తీసుకొస్తాడు. అనుకున్నాడు విశ్వనాథం.

"క్షమించండి సార్, స్టేట్‌మెంటు చాలా జాగ్రత్తగానేచేశాను. అయినా పొరపాటు దొర్లుంటుంది. కావాలని చెయ్యలేదు. క్షమించాలి" మెల్లగా నసుగుతూ అన్నాడు విశ్వనాథ.

"వాట్? పొరపాటుజరిగిందా? ఎక్కడ!"

"ఎక్కడో తెలీదుసార్, ఏక్కడో జరిగేవుంటుంది" ఆఫీసర్ గది గోడ లదిరిపోయేటట్లు గట్టిగా నవ్వేడు.

విశ్వనాథం ఆఫీసరు కోపానికీ చిరాక్కీ చీవాట్లకీ అలవాటువడ్డాడు గాని నవ్వుకు అలవాటుపడలేదు. తానుచూడగా ఆఫీసరు నవ్వడం యిదే మొదటిసారి. ఈ నవ్వు ఏం కొంపముంచుతుందో అని దిగులు పట్టుకుంది.

"క్షమించండిసార్" అన్నాడు భయం భయంగా.

నో వథింగ్ రాంగ్. మిస్టర్ విశ్వనాథం. ఆడిటర్ మీ స్టేట్ మెంట్ పూర్తిగా ఓ. కే. చేశాడు. రెండో స్టేట్‌మెంట్‌కూడా రెడీచేశారా ఇవాళ మళ్ళీవస్తాడు, అదీకూడా ఓ. కె. అయిపోతే బెడదవదలిపోతుంది.

"రెడీగానేవుంది సార్."

"మీరు పని చాలా శ్రద్ధగా చేస్తున్నందుకు మీకే నెలాఖరు నుంచి ప్రమోషన్ రావచ్చును, నేను రికమెండ్‌చేశాను. కంగ్రాట్యులేషన్స్ మిస్టర్ విశ్వనాథం" అన్నాడు ఆఫీసరు.

"ఏదో మీదయ" అనబోయి మాటరాక పెదిమలు కదిపాడు విశ్వనాథం.

'నౌ యూ కెన్ గో' అన్నాడు ఆఫీసర్.

విశ్వనాథనికి మతిపోయినట్టయింది. నెమ్మదిగా వచ్చి తనసీటులో కూర్చున్నాడు.

అకస్మాత్తుగా తనకి ప్రమోషన్ యిస్తున్నానని ఎందుకన్నాడా అని ఆలోచిస్తున్నాడు విశ్వనాథం. ఆఫీసులోవున్న గుమస్తాల నందరినీ వదిలిపెట్టి తనకే ప్రమోషన్ యిస్తానని ఎందుకనాలి? ఆమాటకూడా ఏదో నవ్వుమొహంతోనే అన్నాడు కాబట్టి. పరిహాసానికన్నాడేమో లేకపోతే తనచేత బాగా పనిచేయించుకోడానికి యిదొక నాటకమేమో లేదా ప్రమోషన్ అని పేరు చెప్పి. నారాయణగాడి సీటులాంటి ఏచిక్కు సీట్లోనో వడేసి, అప్పుడు పొరపాట్లు జరిగితే, ఏకంగా ఉద్యోగం పీకేసి యింటికి పంపించేయాలని ఎత్తులేస్తున్నాడేమో, అదే అయితే పెద్ద ప్రమాదమే. నారాయణగాడు పనిచేస్తున్న సీట్లో అదివరకప్పుడే యిద్దరికి ఉద్యోగాలూడేయి. అలాగయితే తనకి ప్రమోషనూవద్దు. ఉద్యో

సనా వద్దూ. కలోగంజో తాగి ఉన్నచోట పడుండడమే మేలు. అయినా మన చేతులో ఏముంది. నీకు ప్రమోషనిచ్చాం ఫలానా సీటులోకి వెళ్ళు అంటే ఏంచెయ్యగలం?

విశ్వనాథానికి ప్రమోషన్ రానున్నదని అఫీసరుగారి స్టెనో అందరికీ కబురందించాడు. గుమాస్తా లందరూ విశ్వనాథంచుట్టూ చేరి అభినందించడం మొదలుపెట్టేరు.

"చాలా అదృష్టవంతుడివయ్యా" అన్నాడు బ్రహ్మజిరావు.

"ఏమదృష్టమో ఏమో, నాకేం నమ్మకంలేదు సుమా" అన్నాడు విశ్వనాథం.

"ఏదీకావ్‌లేవయ్యా, అఫీసరు చెప్పింతరవాత యింకా నమ్మకం లేకపోతే ఎలాగ?"

ఏ చిక్కు సీట్లోనో వేసి యింటికి పంపించేయాలని చూస్తున్నాడేమో!"

"ఇప్పుడు చేస్తున్న ఈవెధవుద్యోగం కంటె యింటికిపోవడమే మంచిదిలే" అంటూ అతను తన సీట్లోకి వెళ్ళిపోయాడు.

ఈ బ్రహ్మజీ తన్నెలాగైనా యింటికి పంపించేసి తనమేనలుడ్ని నా సీట్లో ఉద్యోగం వేయించాలని చూస్తున్నాడు కాబోలు. తన దగ్గరా పప్పు ఉడకవు" అయ్యా, నాకు ప్రమోషన్‌వద్దు, నన్ను ఉన్నచోటే వుంచండి అంటూ ఆఫీసర్ని బ్రతిమాలి తను కూచున్న చోటునుంచి మరి కదలడు. అంతే అనుకున్నాడు విశ్వనాథం.

అంతలో అఫీసరుగారు స్టేట్‌మెంటు పట్టుకురమ్మన్నారని కబు రొచ్చింది. విశ్వనాథం హడావిడిగా పరుగెత్తేడు.

విశ్వనాథం అందించిన స్టేటుమెంటును

మెంటును ఓ అయిదు నిముషాలపాటు పరిశీలించి ఆఫీసరుగారు దానిమీద సంతకంచేసి ప్రక్కరూమ్‌లో ఆడిటర్‌గార్కి తీసుకువెళ్ళి ఇవ్వండి" అంటూ కాగితాలు తిరిగిచ్చేశాడు.

విశ్వనాథం ఆ కాగితాలు తీసుకుని ప్రక్కరూమ్‌లోకెళ్ళాడు, ఆడటర్ ఇవాళ తీరిగ్గాకూర్చుని సిగరెట్టు కాల్చుకుంటున్నాడు. విశ్వనాథాన్ని చూసి చిరునవ్వు నవ్వి "రండి కూర్చోండి" అన్నాడు.

విశ్వనాథం ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని కాగితాలందించాడు.

ఆడిటర్ కాగితాలు చూడలేదు. సిగరెట్టు కాల్చడం పూర్తయేక కాగితాలు చూద్దామనుకుంటాడు. అతను కుర్రవాడు. పాతికేళ్ళుంటాయేమో అందంగా ఆరోగ్యంగావున్నాడు. సూటేసుకున్నాడు. తీరిగ్గా సిగరెట్టు కాలుస్తూ "మీ పేరేమిటో తెలుసుకోవచ్చా" అన్నాడు మర్యాదగా ఇంగ్లీషులో.

"విశ్వనాథం అండి."

"మీ ఇంటిపేరు ?"

ఫలానా అని చెప్పాడు విశ్వనాథం. ఆడిటర్ ఆశ్చర్యంగా చూశాడు.

"మీరు చిన్న వీథిలోగదూ వుంటున్నారూ ?" అన్నాడు మళ్ళీ.

"అవునండీ" అన్నాడు విశ్వనాథం తనక్కడుంటున్నది వీడికెలా తెలుసు చెప్మా అని ఆశ్చర్యపోతూ, విశ్వనాథంకి అక్కడ పనేమీలేదు. ఇక వెళ్తే బావుంటుందని లేచి నిలుచున్నాడు.

"ఆడిటర్‌గారూ, మరి నేను వెళ్ళొచ్చా" అన్నాడు.

ఆడిటర్ నవ్వి "నా పేరు ఆడిటర్‌కాదు. మాధవరావు" అన్నాడు.

'చిత్తం.'

"రాధ మి అమ్మాయేకదూ ?" అన్నాడు ఆడిటర్.

"అవునండీ, మీకు తెలుసా ?"

"తెలుసండి, బీకామ్‌లో నాకు జూనియర్. ఆ తరువాత నేను ఎమ్‌కామ్ చదివి, ఈ ఉద్యోగంలోచేరేను."

"అలాగ అండి."

"మీ అమ్మాయి ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పింది"

"అవునండి, తమవంటివారు ఏదో సాయంచేస్తే తప్ప మాబోటి వాళ్ళ కేవరిస్తారండి వుద్యోగాలు."

"నేను ఒకచోట చెప్పిపెట్టేను. మరొక రెండురోజుల్లో ఉద్యోగం కావచ్చు. మంచి కంపెనీ జీతంకూడా బాగా యిస్తారు. నే చెప్పేనని చెప్పండి.

"చిత్తం మీ మేలుమరచిపోలేమండి. ఆడపిల్లలు ఉద్యోగాలు చెయ్యటం మా వంశంలో ఎక్కడాలేదండి. కాని ఇంట్లో జరుబాటు కావడం కష్టగావుంది. ఏంచెయ్యడం చెప్పండి. ఏదో తల్లిచాటున పెరిగిన పిల్ల ఉద్యోగం చెయ్యగలదా అవి నాకు అనుమానమె. కాని మేము ఇంట్లోపడుతున్న అవస్థలుచూసి తను ఉద్యోగం చేస్తానంటుంది, అంటూ గద గద మాట్లాడేశాడు విశ్వనాథం.

ఆడిటర్ అంతా విని "సరే మీరు వెళ్ళండి! కాగితాలు తరవాత పంపిస్తాను" అన్నాడు.

విశ్వనాథం గదిలోంచి బయటపడి, తన సీటులోకి వెళ్ళి కూర్చు న్నాడు. రోజు జరిగి ఘటనలన్నీ ఒకదాని తరువాతొకటి జ్ఞాపకాని కొచ్చాయి. ఫర్నిచర్ షావువాడు తనకు ఉద్యోగమిస్తాన్నాడు. తన

ఆఫీసరు తనకు ప్రమోషనిస్తానన్నడు. ఆడిటర్ తన కూతురికి ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. చాల ఆశ్చర్యంగావుంది. అన్నీ తనకు మంచి జరగబోతూందనే శుభవార్తలే. మేలు చేస్తామనే వాగ్దానాలే. కాని వాగ్దానాలు చెయ్యడం వేరు వాటిని నిలబెట్టుకోవడం వేరు. అంతా కబురు చెప్పి అరచేతిలో వైకుంఠం చూపిస్తారు. కాని తన కెవరైనా, ఆఫీసరు కానిండి, ఆడిటర్ కానీండి ఉత్తినే ఉపకారం ఎందుకుచేస్తాడూ? తనవల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనమూవుండదు. అలాంటప్పుడు తనకీ ఉపకారం చెయ్యవలసిన అగత్యమేముంది. కాబట్టి యిదంతా నమ్మదగి నదిగా అనిపించలేదు విశ్వనాథానికి.

టేబిలుమీద ఫైల్సువచ్చి పడ్డాయి పనిలో మునిగిపోయాడు విశ్వనాథం.

తనకు ఫలానా కంపెనీలో ఉద్యోగమయిందని శుభవార్త చెప్పింది రాధ తల్లి, చెల్లెలు. చాల సంతోషించారు. విశ్వనాథం మాత్రం ఏమీ మాటాడలేదు.

"నాకిచ్చిన ఉద్యోగానికి ఎమ్ కాంలుకూడా అప్లయిచేశారు నాన్నా కాని మన అదృష్టం బాగుంది అన్నది రాధ.

"ఎమ్ కాంలు అప్లయిచేస్తే మరి నీ కెందుకిచ్చారూ. ఇందులో ఇందులో ఏదైనా పితలాటకం వుందేమో.

"అలాంటిదేం లేదు నాన్నా. అసలా పనికి బీకాంచాలు మాధవ రావుగారు మా కంపెనీ డైరెక్టరుకు మంచి స్నేహితుడు. మాధవరావు గారి మాట తోసేలేక నాకు ఉద్యోగమిచ్చాడు."

"ఓహో అలాగా? మాధవరావంటే మా కంపెనీ ఆడిటరేనా?"

"ఆయనే నాన్నా, మీతో మాట్లాడేరటగా నాకు చెప్పేరు"

"మనిషి మంచివాడేనా?"

"చాలా మంచివారు నాన్నా, చాల పెద్దమనిషి."

"ఏమో ఈకాలంలో అంతా పెద్దమనుషుల్లాగే కనిపిస్తారులే. అసలు ఎవడెలాంటి వాడో మనకేం తెలుసు?"

రాధ మరేమీ మాటాడలేదు,

రాధ ఉద్యోగంలో చేరి నెలకు ఐదు వందలు సంపాదిస్తూంది జీతం అందుకుని ఇంట్లో అందరికీ బట్టలు కొన్నిది. తమ్ముడికీ, చెల్లెలికి పుస్తకాలూ, పెన్నులు వంటి వస్తువులు కొన్నది,

రాధ ఉద్యోగంలో చేరేక ఇంటి పరిస్థితి మెరుగయిందండీ. కాని అలా అని ఆడపిల్లని ఎన్నాళని ఇంట్లో వుంచుకుంటాం? ఏదైనా సంబంధం చూడండి. డబ్బు గడిస్తున్న పిల్ల ఎవడయినా కళ్ళు మూసుకుని కానీ కట్నం లేకుండా చేసుకుంటాడు. అన్నది విశ్వనాథం భార్య.

మా చెల్లెలు కొడుకున్నాడుగా రామం చేసుకుంటుందేమో అడుగు. వాడయితే ఓరెండువేలు కట్నం ఇస్తే చాలు. వాళ్ళతో మనం సరితూగగలం. వాళ్ళూ మనలాంటి సంసారులే.

అడిగానండీ నేను చేసుకోనంటూంది.

సరే అయితే ఆలోచిద్దాంలే అని వెనక్కి తిరిగి నిద్రపోయాడు. విశ్వనాథం.

రాధకి మాధవరావుకీ పరిచయం బాగా ఎక్కువయింది. మాధవరావు అప్పుడప్పుడు సాయంత్రం కారులో వచ్చి రాధతోపాటు బీచికి వెళ్ళి అక్కడనుంచి రాధను ఇంటి దగ్గర దిగబెట్టి వెళ్ళేవాడు.

ఒకరోజు మాధవరావు రాధతో వివాహ ప్రసక్తి తీసుకువచ్చాడు.

నాకు చాలా బాధ్యతలున్నాయి. మానాన్న ముసలివారైపోయారు. నిజానికిప్పుడు నేను ఉద్యోగం చెయ్యకపోతే ఇల్లు గడవదు. మా

తమ్ముడికీ, చెల్లెలికీ చదువులు చెప్పించాలి. నేను పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే ఎలాగవుతుంది, అన్నది రాధ.

నీకా బెంగక్కర్లేదు రాధా. నువ్వు ఉద్యోగం మానక్కరలేదు. నీ జీతం మీ వాళ్ళకే ఇయ్యి. నీ జీతంలోనించి ఒక్క నయాపైసాకూడా నా కక్కర్లేదు. నాకు మంచి ఆదాయముంది. మనకదిచాలు, ఆలోచించు అన్నాడు మాధవరావు.

మా నాన్నగార్ని, అమ్మనీ అడగండి. వాళ్ళేమంటారో ? అంది. సందేహంగా రాధ.

సరే రేపొచ్చి మీ వాళ్ళనడుగుతాను అన్నాడు మాధవరావు.

మాధవరావు చాలా ధనవంతుడు, అందగాడు. చదువుకున్నవాడు. పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. అలాంటివాడు తనలాంటి వాడి కూతుర్ని ఎందుకు చేసుకుంటానంటున్నాడో విశ్వనాథానికర్థం కాలేదు.

నాకు నమ్మకం లేదు సుమా అన్నాడు విశ్వనాథం.

అంటే మన పిల్లకి మాత్రం ఏం లోటండీ అంది భార్య.

అది కాదే కాని కట్నం అక్కర్లేదంటున్నాడు. ఏ లోపమూ లేకపోతే కట్నం లేకుండా పెళ్ళెందుకు చేసుకుంటాడూ అని నా సందేహం అన్నాడు విశ్వనాథం.

"పిల్ల నచ్చింది కాబోలు"

పిల్ల నచ్చితే కట్నం వదులుకుంటారటే. డబ్బున్నవాడు, మంచి ఉద్యోగం చేస్తున్నాడు. కేవలం దయ తలచి పెళ్ళి చేసుకుంటున్నాడేమిటి?

ఏమో మరి

అదీ కాక వాళ్ళ తాహతెక్కడ, మన తాహతెక్కడ? వాళ్ళతో మనం సరితూగ గలమా? పేదవాళ్ళ పిల్లని వాళ్ళు దాన్ని అవమానించ రంటావా?

అంతలో పక్క గదిలోంచి రాధ వచ్చింది.

నాన్నా మీ సందేహాలన్నిటికి నేను సమాధానాలు చెప్పలేను. కాని నాకు ఆ మనిషిమీద అతని సంస్కారం మీదనమ్మకం ఏర్పడింది. ముందు ముందు ఏం జరుగుతుందో అనే భయం మీద ఏ పని చెయ్యకుండా ఎలా వుంటాం నాన్నా అన్నది రాధ.

పోనీ దానికిష్టమయితే చెయ్యరాదుటండీ అంది భార్య.

ఇక్కడ మీరు ఇబ్బంది పడకుండా ప్రతి నెలా నా జీతంలో నాలుగువందలు మీకిచ్చేస్తాను. రూపాయకీ అర్ధకీ ఆయన్ని అడగవల సిన అవసరం లేకుండా ఒక వందరూపాయలు నేనుంచుకుంటాను. ఈ విషయం ఆయనకి స్పష్టంగా చెప్పేను.

నా తల్లే, కొడుకువైనా కూతురువైనా మాకు నువ్వే తల్లీ. నీ ఇష్టమొచ్చిన పెళ్ళే చేసుకోమ్మా అంది తల్లి.

జీతం మనింటో యివ్వనిస్తాడా, నాకు సందేహమే అన్నాడు విశ్వనాథం.

మీ సందేహాల కంతులేదు. ఈ పిల్లకి మీ చేతుల్తో మీరు ఎప్పటి కైనా పెళ్ళి చేస్తారా? ఈ చంటి పిల్లలకి మీరు చదువులు చెప్పిస్తారా? యిలాంటి సందేహాలు నాకూ వున్నాయి. కాబట్టి ఇక చాలు ఊరుకోండి అంది భార్య.